క్లుప్తంగా

ఎన్‌సీసీ క్యాడెట్ల ఎంపిక



ఎన్‌సీసీకి ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపల్ రాజశేఖర్, సోమరాజు

పుంగనూరు: పట్టణంలోని శుభారాం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపల్ డాక్టర్ రాజశేఖర్ ఆధ్వర్యంలో ఆదివారం ఎన్‌సీసీ క్యాడెట్ల ఎంపిక నిర్వహించారు. ఎన్‌సీసీ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ కె.సోమరాజు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థుల శారీర దృఢత్వం, ఎత్తు, బరువు పరిశీలించారు. అలాగే పరుగు పందెం నిర్వహించి మొత్తం 39 మందిని ఎంపిక చేశారు. కార్యక్రమంలో చిత్తూరు ఎన్‌సీసీ ఉద్యోగులు వెంకటేశు, మొగిలినాయుడు పాల్గొన్నారు.

ఎంపీడీఓ మృతికి సంతాపం



రమణ (ఫైల్)

బైరెడ్డిపల్లి: బైరెడ్డిపల్లెకు చెందిన రామసముద్రం ఎంపీడీఓ రమణ ఆదివారం గుండెపోటుతో మరణించారు. గతంలో ఆయన బైరెడ్డిపల్లె, గుడుపల్లె మండలాల్లో పనిచేశారు. ఆయన మృతికి పలమనేరు ఎమ్మెల్యే ఎన్.అమరనాథరెడ్డి ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. బైరెడ్డిపల్లెలో ఆయన మృతదేహం వద్ద నివాళులు అర్పించారు. కుటుంబసభ్యులను పరామర్శించారు.

6న ముస్లిం ఆత్మీయ సమావేశం

చిత్తూరు రూరల్ (కాణిపాకం): ముస్లిం ఐక్యవేదిక ఆధ్వర్యంలో అక్టోబర్ 6న నిర్వహించ తలపెట్టిన ముస్లిం ఆత్మీయ సమావేశాన్ని విజయవంతం చేయాలని రాష్ట్ర అధ్యక్షులు జాఫర్‌పులి పిలుపునిచ్చారు. చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఆత్మీయ సమావేశ పోస్టర్లను ఆవిష్కరించారు. జాఫర్ పులి మాట్లాడుతూ ముక్కలుగా ఉన్న ముస్లిం సమాజాన్ని ఒక్కటి చేస్తూ, రాజకీయ పార్టీలకు, జమాతులకు అతీతంగా ముస్లిం ఐక్యవేదిక పని చేస్తుందన్నారు. రాజ్యాంగ హక్కుల సాధన, సంక్షేమంలో సమానత్వం, రాజ్యాధికారం, ముస్లిం సామాజికవర్గ అవసరాలు, సమస్యలు, ముస్లిం సామాజికాభివృద్ధికి అవసరమయ్యే ప్రతి అంశం మీద ముస్లిం ఐక్యవేదిక పని చేస్తుందన్నారు. ప్రస్తుతం ముస్లిం ఐక్యవేదిక సంపూర్ణ సామాజిక అధ్యయనం, సంపూర్ణ సామాజిక ప్రక్షాళన, సంపూర్ణ సామాజిక చైతన్యం, దీర్ఘకాలిక ప్రయోజనాల కోసం పనిచేస్తూ భావితరాలకు ఒక దిక్సూచిగా మారాలన్నదే ఐక్యవేదిక అంతిమ లక్ష్యమన్నారు. చిత్తూరు ఉర్దూ షాదీఖానాలో రాష్ట్ర స్థాయి సమావేశాన్ని ఏర్పాటు చేశామని, దీనిని విజయంతం చేయాలని కోరారు. రాష్ట్ర అధికార ప్రతినిధి ఖలీల్ సయ్యద్, సెక్రటరీ సయ్యద్ నూర్, ఉపాధ్యక్షుడు రషీద్, జిల్లా కార్యదర్శి ఇనాయతుల్లా, తిరుపతి జిల్లా అధ్యక్షుడు నిజాముద్దీన్ పాల్గొన్నారు.


బంగారుపాళెంలో వర్షం

బంగారుపాళెం: మండలంలో ఆదివారం సాయంత్రం ఓ మోస్తారు వర్షం కురిసింది. ఉదయం నుంచి ఎండ తీవ్రత ఎక్కువ కావడంతో ప్రజలు ఉక్కపోతతో అవస్థలు పడ్డారు. సాయంత్రం ఉన్నఫలంగా వాతావరణంలో మార్పులు చోటు చేసుకుని జోరుగా వర్షం కురిసింది. వర్షపు నీరు చెన్నై–బెంగళూరు జాతీయ రహదారిపై ప్రవహించడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు.

కూటమి అక్రమాల ఉపాధి

ద్వామా నేతృత్వంలో చేయాల్సిన ఉపాధి పనులు ఇప్పుడు కూటమి నాయకుల పర్యవేక్షణలో సాగుతున్నాయి! కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే గతంలో ఉన్న ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లను ఆయా మండలాల్లోని నాయకులు తొలగించారు. అధికారులపై ఒత్తిళ్లు తెచ్చి తమకు అనుకూలమైన నియమించుకున్నారు. పలమనేరు రెవెన్యూ డివిజన్ పరిధిలో యంత్రాలతో పనులు చేయడటం, పాత గుంతలకే బిల్లులు, బినామీ కూలీల పనులకు జాబ్‌కార్డు ఉన్న వారి ఖాతాల్లో డబ్బులు పడగానే వాటిని కూటమి నేతలు పెట్టిన ఏజెంట్లు పొందడం సర్వసాధారణంగా మారింది. ఆయా మండలాల్లో ఉపాధిలో ఎలాంటి అక్రమాలు చేసినా ఏపీఓలు, క్లస్టర్లలోని ఏపీడీలు సైతం కళ్లప్పగించి చూడటం మినహా ఎలాంటి చర్యలూ తీసుకోవడం లేదు. దీంతో నిజమైన కూలీలకు అందాల్సిన కేంద్ర నిధులు అక్రమార్కుల జేబులు నింపుతున్నాయి.

- నిబంధనలకు పాతర
- నేతల కనుసన్నల్లో పనులు
- యంత్రాలతో పనులు.. ఆపై నకిలీ కూలీలతో పైపై మెరుగులు
- కొన్నిచోట్ల పాత గుంతలకే మళ్లీ.. మళ్లీ బిల్లులు
- దాసోహం అంటున్న ఏపీఓలు
- మరికొన్ని చోట్ల ఫీల్డ్ అసిస్టెంట్లే అక్రమార్కుల అవతారం
- ఉపాధి అక్రమాల్లో సిబ్బంది, అధికారుల భాగస్వామ్యం
- ఇదీ పలమనేరులో దారి తప్పిన ఉపాధి



యంత్రాలతో ఫీల్డ్ అసిస్టెంటే పనులు చేస్తున్నాడంటూ నగిరేపల్లె గ్రామస్తులు ఇచ్చిన ఫిర్యాదు



పెద్దపంజాణి మండలంలోని నగిరేపల్లె గాని చెరువులో యంత్రాలతో సాగిన పనులు, పనుల వద్ద జేసీబీ చక్రాల గుర్తులు

పలమనేరు: పలమనేరు క్లస్టర్ పరిధిలో 67,160 జాబ్‌కార్డులున్నాయి. ఇందులో 1,47,670మంది కూలీలున్నారు. వీరికి ఏటా సగటున 14,33,920 పనిదినాలను కల్పించాల్సి ఉండగా గత మూడేళ్ల నుంచి 10 వేల సగటున పని దినాలను కల్పించి 70 శాతం దాకా టార్గెట్ పూర్తి చేశారు. ఏటా సగటున ఉపాధి కోసం కూలీలు, మెటీరియల్ కాంపొనెంట్‌గా రూ. 50 కోట్లను కేంద్రం వెచ్చిస్తోంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో 2022–23, 2023–24కు సంబంధించి క్లస్టర్‌లో 14.35లక్షల పని దినాలను కల్పించాలనే లక్ష్యంలో 70శాతం పూర్తి చేశారు.

కూటమి ప్రభుత్వంలో రెండు క్లస్టర్లుగా విడగొట్టి పనులిలా...

ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పలమనేరు క్లస్టర్‌ను పలమనేరు, పుంగనూరు క్లస్టర్లుగా మార్చారు. ఈ రెండు క్లస్టర్లలో మొత్తం 132 పంచాయతీలకు కలిపి హౌస్ హోల్డ్స్ 1,19,898 ఉండగా ఉపాధి జాబ్‌కార్డులు మొత్తం 2,16,603 ఉన్నాయి. ప్రస్తుతం 70,630 మంది జాబ్‌కార్డుదారులు పనులు చేస్తున్నారు. ప్రస్తుతం ఈజీఎస్‌లో నీటి కుంటలు, ఫిష్ పాండ్స్, ఫీడర్ ఛానల్స్, హార్టికల్చర్ ప్లాంటేషన్స్, క్యాటిల్ పాండ్స్, రోడ్డు పనులు, ట్రెంచ్‌లు, చెక్‌డ్యాం పనులు జరుగుతున్నాయి.

సాఫ్ట్‌వేర్‌నే బురిడీ కొట్టిస్తున్న వైనం!

టీసీఎస్ సాఫ్ట్ వేర్ ద్వారా ఉపాధి పనుల రికార్డింగ్, బిల్లుల వ్యవహారాలు జరిగేవి. అయితే దీని ద్వారా కొందరు ఉపాధి సిబ్బంది అక్రమాలు చేయడం నేర్చుకుని ప్రభుత్వ సొమ్ముకు గండి కొట్టేవారు. దీనిని గమనించిన కేంద్ర ప్రభుత్వం ఎన్ఐసీ (నేషనల్ ఇన్‌ఫ్రోమాటిక్స్ సెంటర్) వెబ్‌సైట్‌ను తీసుకొచ్చింది. దీన్ని నేవా(నేషనల్ ఇ విధాన్) నిర్వహిస్తోంది. పాత సాఫ్ట్‌వేర్‌లో చేసిన పనులనే చూపెట్టి బిల్లులు పొందినట్టు ఇందులో కుదరదు. కానీ ఇప్పటి కూటమి నేతలు పెట్టుకున్న ఫీల్డ్ అసిస్టెంట్లు జీపీఆర్ సెట్టింగ్స్‌ను సైతం మార్చి గతంలో జరిగిన లొకేషన్లు కొత్త లొకేషన్లుగా అప్‌లోడ్ చేసి ఏమాత్రం అనుమానం రాకుండా దోచేస్తున్నారు. ఇంటి దొంగలను పట్టేదెవరు? అన్నట్లు ఉంటోంది ఇక్కడి పరిస్థితి.

తాజాగా సాగుతున్న అక్రమాలు

- పెద్దపంజాణి మండలం తుర్లపల్లె పంచాయతీ నగిరేపల్లె సమీపంలోని గొనిచెరువులో కూలీలతో మట్టితీత పనులకు ద్వామా అధికారులు అనుమతులిచ్చారు. అయితే అక్కడి ఫీల్డ్ అసిస్టెంట్ నాయకుల మాటమేరకు జేసీబీతో ఈ పనులు చేయించాడు. ఆపై కూలీలతో వీటిని చేసినట్టు రికార్డులు సృష్టించేశాడు. కానీ పనులు చేసిన చోట జేసీబీ టైరు గుర్తులుఇప్పటికీ చెక్కుచెదరలేదు. ఇది గమనించిన కూలీలు గట్టిగా ప్రశ్నించారు. గ్రామస్తులు సైతం ఇక్కడి ఉపాధిలో సాగుతున్న అక్రమాలపై విచారణ చేసి సంబంధిత ఫీల్డ్ అసిస్టెంట్‌ను తొలగించాలంటూ రెండ్రోజుల క్రితం ఆ మండల ఎంపీడీఓకు రాతపూర్వకంగా ఫిర్యాదు సైతం చేశారు. అయితే అక్కడి ఎంపీడీఓగానీ, ఉపాధి అధికారులుగానీ అసలు పట్టించుకోలేదు. దీనిని బట్టి చూస్తే కూటమి నేతల కనుసన్నల్లో అధికారులు ఎలా మసలుకుంటున్నారో ఇది చెప్పకనే చెబుతోంది.
- పలమనేరు మండలం పెంగరగుంట పంచాయతీలో తాజాగా కూటమి నేతలు ఓ ఫీల్డ్ అసిస్టెంట్‌ను పెట్టుకున్నారు. ఆయన స్వామి భక్తిని చాటుకునేందుకు అక్కడి నేతలు చెప్పినట్టు పలు చెరువుల్లో పాత గుంతలనే నగిషీలు చేసి బిల్లులు పెట్టించేశాడని తెలిసింది. ఇదే పరిస్థితి మొరం చెరువులోనూ జోరుగా సాగుతోంది.ఈ అక్రమాలను అరికట్టాల్సిన ఆ మండల ఉపాధి అధికారులు సైతం నేతలకు దాసోహమయ్యారు.
- గంగవరం మండలంలో కూటమి నేతలదే ఇష్టారాజ్యమైంది. అక్కడి అధికారులు వీరిచెప్పినట్టు తలాడిస్తూ ఉపాధి పనుల్లో ఎన్ని అక్రమాలు చేసినా బిల్లులు చేసేస్తున్నారు. వడ్డించేవాడు మనోడైతే పంక్తిలో ఎటు కూర్చుంటే ఏమన్నట్టు..తయారైంది ఇక్కడ పరిస్థితి.
- బైరెడ్డిపల్లె మండలంలో ఏకంగా పచ్చనేతలే ఈజీఎస్ అధికారులుగా కొత్త అవతారం ఎత్తారు. ఉపాధి పనులను వారే నిర్ణయించి వారికి కావాల్సిన కూలీలను ట్రాక్టర్లలో తీసుకెళ్లి స్వయంగా వారే పనులు చేయిస్తున్నారనే విమర్శలొస్తున్నాయి. పైగా ఈ పనులకు సంబంధిత ఏపీఓ సైతం నోరు మెదపకుండా బిల్లులు చేయిస్తుంటే కూటమి నేతలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా పనులు సాగుతున్నాయి. ఉన్నతాధికారులు సైతం నేతల దెబ్బకు సైలెంటయ్యారు. ఇక్కడ సాగుతున్న అక్రమాలపై ఏపీడీ వెంకటరత్నంను వివరణ కోరేందుకు ప్రయత్నించగా.. ఆయన ఫోన్ లిఫ్ట్ చేయడమే లేదు.

రేపటి నుంచి 'పొలం పిలుస్తోంది'

కుప్పం రూరల్: కుప్పం మండలంలో మంగళవారం నుంచి 'పొలం పిలుస్తోంది' నిర్వహించనున్నట్టు వ్యవసాయాధికారి అమృతవల్లి చెప్పారు. తొలిరోజు ఉదయం చందం, మధ్యాహ్నం నూలకుంట, 25న కొత్తపల్లె, మధ్యాహ్నం జీసీ పల్లెలో వ్యవసాయ అనుబంధ సంస్థలతో నిర్వహించే ఈ కార్యక్రమంలో ఆధునిక వ్యవసాయ పద్ధతులు, తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి, ద్రవ, ఘన జీవామృతం తయారీ, సేంద్రియ పద్ధతుల్లో వ్యవసాయం, వ్యవసాయ సబ్సిడీలు..ఇత్యాది వాటిపై అవగాహన కల్పించనున్నట్లు తెలియజేశారు. దీనిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు మున్సిపల్ కార్మికులకు వైద్య శిబిరం

పుంగనూరు: మున్సిపాలిటీ పారిశుధ్య కార్మికుల కోసం స్థానిక ఏరియా ఆసుపత్రిలో వైద్య శిబిరం నిర్వహించనున్నట్టు కమిషనర్ మధుసూదన్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. దీనిని కార్మికులు, వారి కుటుంబ సభ్యులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వరద బాధితుల కోసం..!



దుకాణదారుల నుంచి సేకరిస్తున్న బియ్యం

కుప్పం: విజయవాడ వరద బాధితుల సహాయార్థం కుప్పంలో సాయిమాత సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులు, ఇతర సామగ్రి సేకరించారు. పట్టణంలో ప్రత్యేక ఆటోలలో అనౌన్స్‌మెంట్ చేస్తూ దుకాణదారులు, ప్రజల నుంచి బియ్యం, పప్పు, ఉప్పు, కూరగాయలు, దుప్పట్లు, ఇతరత్రా సామగ్రి సేకరించారు. నియోజకవర్గంలో దాతల నుంచి సేకరించిన వాటిని అక్టోబర్ మొదటి వారంలో వరద బాధితులకు అందజేస్తామని ట్రస్ట్ నిర్వాహకులు తెలిపారు.

హడావుడిగా బోరు మోటారు ఏర్పాటు

- ఎమ్మెల్యే చేతుల మీదుగా ప్రారంభం
- ప్రజాప్రతినిధులకు సమాచారం నిల్
- ఆగ్రహం వ్యక్తం చేసిన ఎంపీటీసీ, సర్పంచ్
- వైఎస్సార్ సీపీ హయాంలో బోరు వేసి, పైపులు కొనుగోలు
- తమ పాలనలో అన్నట్టు కూటమి కలరింగ్!



బైరెడ్డిపల్లె: తీర్థంలో బోరు మోటారును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అమరనాథరెడ్డి

బైరెడ్డిపల్లె: మండలంలోని తీర్థం, దేవదొడ్డి, ధర్మపురి గ్రామాల్లో ఆదివారం ।ఇది మంచి ప్రభుత్వం॰ కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో తీర్థం సమీపంలోని పసలమందమిట్టలో బోరు వేసి మోటారు, పైపులు కొనుగోలు చేశారు. అయితే ఆదివారం ఎమ్మెల్యే కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలుసుకున్న తెలుగుదేశం పార్టీ నాయకులు హడావుడిగా బోరుకు మోటారు ఏర్పాటు చేసి అట్టహాసంగా ఎమ్మెల్యే ఎస్.అమరనాథరెడ్డి చేతుల మీదుగా ప్రారంభించారు. ప్రజాప్రతినిధులకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా ప్రారంభించారని ఎంపీటీసీ రవీంద్రమ్మ, సర్పంచ్ జ్యోతమ్మ మండిపడ్డారు. ఇక, తీర్థం గ్రామసభలో ఎమ్మెల్యే మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తామన్నారు. గత ప్రభుత్వం హయాంలో వివిధ దశల్లో ఆగిపోయిన పేదల గృహాలను పూర్తి చేసేందుకు తమ ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రాజేంద్రబాలాజీ, తహసీల్దార్ మాధవరావు, ఏఓ గీతాకుమారి, టీడీపీ నేతలు పాల్గొన్నారు.

పెంగరగుంటలో సమస్యల వెల్లువ

పలమనేరు: మండలంలోని పెంగరగుంటలో ఆదివారం సాయంత్రం స్థానిక ఎమ్మెల్యే అమరనాథరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో సమస్యలు వెల్లువెత్తాయి. ముఖ్యంగా తొలగించిన పింఛన్లు, కౌండిన్యలో ఇసుక రవాణా, ముసలిమడుగు నుంచి ఏటిగడ్డిండ్లుకు రహదారి, కౌండిన్యపై వంతెన, క్రిష్టాపురానికి కంకరతో వదిలేసిన రోడ్డు, ఏనుగుల సమస్య తదితరాలపై ప్రజలు అర్జీలను ఇచ్చారు. ఆపై ఇంటింటికి స్టిక్కర్లను అంటించారు. ప్రజల నుంచి సమస్యలపై వచ్చిన వినతులను త్వరలో పరిష్కరిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

చౌడేపల్లిలో..

చౌడేపల్లె: స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఆదివారం 'ఇది మంచి ప్రభుత్వం' గ్రామసభ నిర్వహించారు. అనంతరం బస్టాండు మీదుగా హైస్కూల్ వరకు ర్యాలీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ హనుమంతు నాయక్, ఇన్‌చార్జి ఎంపీడీఓ కృష్ణవేణి, డ్వామా ఏపీడీ రవికుమార్, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

నిమజ్జనానికి తరలిన భారీ వినాయకులు



రాధా బంగ్లా వినాయకుడి విగ్రహం

పలమనేరు: పట్టణంలో వినాయక చవితి సందర్భంగా ఏర్పాటు చేసిన రెండు భారీ వినాయకుని విగ్రహాలు ఆదివారం నిమజ్జనానికి తరలాయి. స్థానిక రాధా బంగ్లా, మునినారాయణ శెట్టి వీధుల్లో ఏర్పాటు చేసిన భారీ విగ్రహాలను ఆయా ప్రాంత నిర్వాహకులు, ప్రజలు మేళతాళాలు, డీజే సౌండ్ల మధ్య, భారీ టపాకాయల మోత, యువకుల కేరింతలు, నత్యాల నడుమ నిమజ్జనానికి ఊరేగింపుగా తీసుకెళ్లారు.

వరద బాధితులకు విరాళం

చిత్తూరు కలెక్టరేట్: విజయవాడ వరద బాధితుల సహాయార్థం తమ వంతు రూ.1 లక్ష సహాయం చేశారు. ఈ మేరకు ఆదివారం నగరంలోని మురుగానపల్లెలో ఉన్న వివేకానంద (వీఎంకే) జూనియర్ కళాశాల నిర్వహకులు ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్‌కు చెక్కును అందజేశారు. కళాశాల నిర్వాహకులు మహేంద్రకుమార్, భాస్కరనాయుడు, కొంగారెడ్డిపల్లికి చెందిన సతీష్, రాహుల్ చౌదరి పాల్గొన్నారు.



ఐదు దశాబ్దాల స్నేహగీతం

- పలమనేరులో అపూర్వ' సమ్మేళనం

పలమనేరు: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1974–75లో పదోతరగతి చదివిన అప్పటి పూర్వ విద్యార్థులు ఆదివారం పలమనేరులో సమ్మేళనం నిర్వహించారు. ఒక హోటల్లో కలిసి చిన్ననాటి జ్ఞాపకాల పూదోటలో విహరించారు. తాము చదివిన స్కూలుకోసం రూ.2.50లక్షలతో వాటర్ ప్యూరిఫైర్ గదిని నిర్మించామని, భవిష్యత్తులోనూ అభివృద్ధికి తమవంతు సహకారం అందిస్తామన్నారు. వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన 70మంది పూర్వ విద్యార్థులు ఇక్కడ సమావేశమయ్యారు.

ఇళ్లలో టపాకాయల నిల్వతోనే ప్రమాదాలు

- నిబంధనలకు విరుద్ధంగా ఇళ్లలోనే టపాసులు
- తాజాగా గంగవరం ప్రమాదంలో దంపతులు మృతి
- ఎస్పీ ఆదేశాలతో దాడులు



రెండ్రోజుల క్రితం పలమనేరులోని ఓ ఇంట్లో టపాసులను సీజ్ చేస్తున్న పోలీసులు (ఫైల్)



గంగవరం సమీపంలో ఇంట్లో టపాకాయలు పేలి ధ్వంసమైన ఇల్లు(ఫైల్)

పలమనేరు: ఇటీవల గంగవరం మండలంలోని మారేడుపల్లె సమీపంలోని ఓ ఇంట్లో బాణసంచా ముడిసామగ్రి ఉంచుకుని అక్కడే టపాసులు తయారు చేస్తుండగా ప్రమాదం సంభవించి ఇల్లు పేలిపోయింది. ఆ ఇంట్లో ఉన్న దంపతులు ఖాదర్ బాషా(47), రిహానా(35), కుమారుడు హమీద్(5) తీవ్రంగా గాయపడగా దంపతులు మృతి చెందడం విదితమే. ఇంట్లో భారీగా నిల్వ ఉంచిన టపాసులు, నల్లమందు తదితరాల కారణంగానే ఈ ప్రమాదం జరిగిందని పోలీసులు నిర్ధారించారు. ఇదే విధంగా పలమనేరు నియోజకవర్గంలోని పలు చోట్ల కొందరు టపాకాయల వ్యాపారులు లైసెన్సు ఉందనే నెపంతో ఇంట భారీగా టపాకాయలను నిల్వ ఉంచుకుంటున్నారు. ప్రమాదం జరిగితే ఎంత ముప్పో తెలిసి కూడా వీరు నిర్లక్ష్యం వహిస్తున్నారు. గంగవరం ఉదంతాన్ని పోలీస్ శాఖ కూడా సీరియస్‌గా తీసుకుంది. జిల్లా వ్యాప్తంగా టపాకాయలు అక్రమంగా నిల్వ ఉంచుకున్న వారిపై పోలీసులు, స్పెషల్ బ్రాంచ్ అధికారులు ఎస్పీ మణికంఠ చందోలు ఆదేశాలతో దాడులకు పూనుకున్నారు. రెండ్రోజుల క్రితం స్థానిక బొరుగులబట్టీ వీధిలో ఓ ఇంట్లో రెండు లక్షల విలువైన టపాకాయలను సీజ్ చేశారు. పెద్దపంజాణి మండలంలతో పాటు మరికొన్ని చోట్ల ఏకకాలంలో పోలీసులు దాడులు చేసి ఇళ్లలో నిల్వ ఉంచిన టపాకాయలను సీజ్ చేశారు.

ఇంకా ఇళ్లల్లో నిల్వ

పోలీసులు తాజాగా సీజ్ చేసింది కొన్ని మాత్రమే. ఇంకా పలువురు టపాకాయల వ్యాపారులు, మరి కొందరు అనధికారికంగానూ ఇప్పటికీ ఇళ్లలో భారీగా టపాసులను నిల్వ ఉంచినట్టు సమాచారం. అయితే వీరిలో కొందరికి టపాకాయలను సీజన్‌లో అమ్ముకోవడానికి మాత్రమే లైసెన్సులున్నాయి. నిబంధనల మేరకు టపాకాయలను ఫైర్ శాఖ ఆమోదించిన సురక్షితమైన గోదాముల్లో మాత్రమే నిల్వ ఉంచుకోవాల్సి ఉంది. అయితే దీనికి భిన్నంగా కొందరు ఇళ్లలోనే టపాసులను నిల్వ ఉంచుకుని ప్రమాదాలతో సహవాసం చేస్తున్నారు.

నాట్యమయం..!



కాణిపాకం: ప్రత్యేక బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని కాణిపాక శ్రీవరసిద్ధి వినాయకస్వామి క్షేత్రంలోని ఆస్థానమండపంలో ఆదివారం సాంస్కృతిక కార్యక్రమాలు వీక్షకులను మైమరిపించాయి. హరికథలు, గీతాలాపనలు, పౌరాణిక నాటక ప్రదర్శనలు వినోదభరితంగా సాగాయి. కూచిపూడి, భరతనాట్య ప్రదర్శనలు అబ్బురపరిచాయి. కళాకారులు ఇచ్చే ప్రదర్శనలకు చూపరులు వేదిక వైపే వాలిపోయారు. అనంతరం కళాకారులకు అధికారులు బహుమతులు ప్రదానం చేశారు.

వైభవంగా అర్జున తపస్మాన్



తవణంపల్లె: మండల కేంద్రంలోని ద్రౌపదీ సమేత ధర్మరాజుల గుడిలో ఆదివారం సాయంత్రం అర్జున తపస్మాన్ వైభవంగా నిర్వహించారు. ఆలయంలో అర్చకులు ద్రౌపదీదేవి సమేత ధర్మరాజులు, భీముడు, అర్జునుడు, నకుల సహదేవుల విగ్రహాలకు అభిషేకం, అలంకరణ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఊరేగింపుగా తీసుకెళ్లి తపస్సుమాను దగ్గర ఉంచారు. కళాకారుడు మణి అర్జున వేషధారణ ధరించి తమిళంలో పద్యాలు పాడుతూ తపస్సుమానును అధిరోహించారు. సంతాన లేమితో బాధపడుతున్న మహిళలు తడిబట్టలతో తపస్మాన్ వద్ద వరపడ్డారు. అర్జునుడు తపస్సుమానును అధిరోహించి పైనుంచి విసిరిన వీబూది, నిమ్మపండ్లు, బిల్వ ఆకులు, బొరుగులు దక్కించుకునేందుకు భక్తులు ఎగబడ్డారు. అనంతరం ద్రౌపదీదేవి, పాండవుల విగ్రహాలను ఊరేగించారు.